కథ

# ముందుచూపు

- కొంపెల్ల విశ్వం

**కి**లో బియ్యం రెండురూపాయలకే ఇవ్వాలని ప్రభుత్వ ప్రయత్నం. ప్రతి నగరం శక్తివంచన లేకుండా నాలుగువైపులా పెరిగే ప్రయత్నంలో పంటచేలు ఇళ్ళ స్థలాలుగా మారిపోతున్నాయి. ప్రతి పట్టణం పొలిమేరల్లో గోరీల్లా మొలుస్తున్న ఇళ్ళన్నీ ఒకప్పటి పంటపొలాలు. పంటచేలే లేకపోతే రెండు రూపాయలకు కాదు అసలు ఎన్ని రూపాయలిచ్చినా బియ్యం ఎలా దొరుకుతాయి?! - చాలామందిలాగే ఈ ఆలోచన సుబ్బయ్యకీ లేదు. అతనికున్నదల్లా ఒకే ఒక్క ఆలోచన.

ఆ కట్టడం ఎంత త్వరగా కట్టాలి, అలా కట్టడం వల్ల తనకు ఎంత మిగుల్తుంది!? ఆ నగరంలో అద్భుతమైన జాగా పట్టాడతను. ఎక్కడెక్కడో వున్న జాగాలను పట్టడం, అక్కడ పెద్ద పెద్ద బిల్డింగులు కట్టడం, అందుకు సంబంధించిన చిన్నా పెద్దా మనుషుల్ని పట్టడం - పట్టుపురుగులు, మల్బరీ 'ఆకుల' జోలికి వెళ్ళకపోయినా టోటల్‌గా సుబ్బయ్యది పట్టుపరిశ్రమ. అదే- మనుషుల్ని పట్టుకునే పరిశ్రమ.

ఒకడు వందకు అమ్ముడుపోతాడు. ఇంకొకడు వెయ్యికి. కాస్త పెద్దవాడు లక్షకి. ఇంకా పెద్దవాడు కోటికి- అసలు అమ్ముడుపోని మనిషే వుండడు అనేది సుబ్బయ్య పాలసీ.

ఒకడు వీధిలో పులి, ఇంట్లో పిల్లి. జానపద కథల్లో మాంత్రికుడి ప్రాణాలు సప్త సముద్రాల కవతల వున్న రామచిలుకలో వున్నట్లు వాడి ప్రాణాలు పెళ్ళాం కళ్ళల్లో వుంటారు. పెళ్ళాం కళ్ళెర్రజేసిందా- ఇక అంతే సంగతులు. వాడి సంగతి అలాటిదని ముందుగా సుబ్బయ్యకే తెలుస్తుంది. వెంటనే వాడి పెళ్ళాన్ని మంచిచేసుకుంటాడు- పట్టుచీరలు, బంగారునగలు, వజ్రాలు ఇచ్చి.

మొగుడి ప్రాణాలే ఆవిడ కళ్ళల్లో వున్నప్పుడు, సుబ్బయ్యకు కావాల్సిన ఫైలు ఆవిడ చేతిలో వుండదా- ఉంటుందని చాలాసార్లు రుజువైంది.

మరొకడుంటాడు- డబ్బు చేతుల్తో ముట్టడు. పెళ్ళాన్ని కూడా ముట్టకోనివ్వడు. ఫ్లాట్స్ రూపంలోనో, డిపాజిట్ రూపంలోనో తనకు కావాల్సిన వాళ్ళ పేరున కావాలంటాడు. అలా కావాలంటున్నాడన్న సంగతి ముందుగా పసిగట్టేది సుబ్బయ్యే. వాళ్లకు కావాల్సిందిచ్చి తనకు కావాల్సింది దక్కించుకుంటాడు.

ఇంకొకడుంటాడు- డబ్బు ముట్టడు. మందు ముట్టడు. నాన్ వెజిటేరియన్ కూడా తినడు. మనుషుల బ్రెయిన్ మాత్రం తింటూ వుంటాడు అసహనంతో. ఆ అసహనానికి కారణం పెళ్ళాం పుట్టింటికి వెళ్ళిందనో, వీడి వెధవమొహం పొద్దస్తమానూ చూడలేక పెర్మనెంట్‌గా వెళ్ళిపోయిందనో, ఇంకా వాడికి పెళ్ళే కాలేదనో- ఆ కారణం ఏదైతే ఉందో అది వెంటనే సుబ్బయ్యకు తెలిసిపోతుంది. అతని 'ఆవరణ్' లో వున్న సీతాకోకచిలుక అతన్ని - అదే ఆ మిస్టర్ అసహనాన్ని యిట్టే మార్చేస్తుంది. సుబ్బయ్య పని జరిగిపోతుంది.

ఏదేనా విషయాన్ని పసిగట్టడంలో సుబ్బయ్య తరువాతే పోలీసు కుక్కలు. అసలు సుబ్బయ్య ప్రతిభ లోపాయికారీగా వుండిపోయింది కానీ లేకపోతే పోలీసు జాగిలాలకు శిక్షణనిచ్చే చీఫ్‌గా నియమించి ప్రభుత్వం అతని రుణం తీర్చుకునేది. ఆ ఆలోచన ప్రభుత్వానికి రాకపోవడం ప్రభుత్వం దురదృష్టం. సుబ్బయ్య అదృష్టం. ఆ మాటకొస్తే సుబ్బయ్య ఎప్పుడూ అదృష్టవంతుడే.

ఇప్పుడు చేజిక్కించుకున్న స్థలం అలాంటిలాటి స్థలం కాదు. సజావైన స్థలం. ఊరికి కొంచెం దూరమైనా పక్కనే మెడికల్ కాలేజీ ఉండడంతో ఆ కాలేజీ ప్రొఫెసర్లు, కుర్రాళ్ళ తల్లిదండ్రులు, రేపు ఉత్తరోత్తరా ఆ మెడికల్ కాలేజీలో డొనేషన్ కట్టి చేరి తీరాలని తీర్మానించుకున్నవారు సుబ్బయ్య కడుతున్న అధునాతన అతి పెద్ద అంతస్తులున్న ఫ్లాట్స్ సముదాయంలో కనీసం తమకు ఒక్క ఫ్లాటేనా కావాలని సుబ్బయ్య వెంట పడ్డారు. నిజానికి సుబ్బయ్యే అలా ప్లాన్‌చేసి వెంటపడేలా చేసుకున్నాడు. అంతకుముందు ఫ్లాట్స్ అన్నిటికీ ఫ్లాట్ రేటు పెట్టిన సుబ్బయ్య ఇప్పుడు ఫ్యాన్సీ రేటు పెట్టాడు.

అంతా బాగానే వుంది కానీ ఫ్లాట్ కాంప్లెక్స్ కడుతున్న లేబర్‌తోనే తలనొప్పి వచ్చి పడింది సుబ్బయ్యకి. వాళ్ళు సత్తుటిఫెన్లలో అన్నమో, సంగటో తెచ్చుకునేవారు తింటానికి. అది కాదతని సమస్య. రెండుసాళ్లు తలనొప్పిగా ఉందని 'చా' తాగాలనేవారు. అక్కడెక్కడా 'చా' దొరకదు- మెడికల్ కాలేజీ క్యాంటీన్‌లో తప్ప. వీళ్ళు అక్కడికెళ్ళలేరు. అంచేత వాళ్ళ 'చా' తాగని తలనొప్పి సుబ్బయ్యకి అతి పెద్ద తలనొప్పిగా తయారైంది.

ఏ సమస్య అయినా ముందు జటిలంగానే కనబడుతుంది. ఆలోచిస్తే మార్గం దొరక్కపోదు. ఆ మార్గమే హనుమంతు. ఈ హనుమంతు రాముడికి కాదు- సుబ్బయ్యకి నమ్మిన బంటు. ప్రస్తుతం నిర్మాణమవుతున్న ఫ్లాట్స్ సముదాయానికి వాచ్‌మన్, కేర్ టేకర్ ఎక్సెట్రా ఎక్సెట్రా. వీడి చేత 'టీ' కొట్టు పెట్టిస్తే ఎలా వుంటుంది- ఆలోచన రావడమే తడవుగా ఆచరణలో పెట్టాడు సుబ్బయ్య. అన్నాళ్ళు నమ్మకంగా పనిచేసినందుకు మేలు చేయబోతున్నట్లు చెప్పి ఓ చిన్న సైజు బడ్డీ కొట్టు పెట్టడానికి అవసరమైన సరంజామాతో బాటు ఆర్థిక సహాయం కూడా అందజేశాడు. అలా అందజేస్తున్నప్పుడు హనుమంతు వేలిముద్ర దస్తావేజు మీద తీసుకోవడం మర్చిపోలేదు సుబ్బయ్య.

సుబ్బయ్య తలచుకుంటే టీకేమీ కొదవ లేదని తొందర్లోనే రుజువైంది. చేపట్టిన పని మంచిదా కాదా అనే విచక్షణ లేకుండా రంగంలోకి దూకేసే హనుమంతు లాంటివాళ్ళు ఎప్పుడూ ఎదుటివారికే ఉపయోగపడతారు.

ఫ్లాట్స్ సముదాయానికి ఓ మూల టీ కొట్టు మొదలైపోయింది. కూలీల తలకొప్పి పోగొట్టే టీ మాత్రమే కాకుండా బన్ను, బిస్కట్లు, అరటిపళ్ళు, బ్రూ- ఇవి కూడా హనుమంతు చేత పెట్టించాడు సుబ్బయ్య. సిగరెట్లు, బీడీలు సరేసరి! అవెందుకు - అనేప్రశ్న హనుమంతు అడగలేదు. అడిగిందానికి బదులు చెప్పడమే కానీ 'ఎందుకు' అని ప్రశ్నించడం చేతకాని వారి ప్రతినిధి అతను.

టీయే కాదు, మిగతావి కూడా అమ్ముడుపోవడం మొదలెట్టాయి. సుబ్బయ్య సలహాతో ఇడ్లీలు, పెసరట్లు చేయడం ప్రారంభమైంది. వాటికీ అలవాటు పడ్డారు జనం. ఆ అలవాటు ఎంతగా అయిందంటే కొంతమంది ఇంటి దగ్గర్నుంచి సంకటి, అన్నం తెచ్చుకోవడం మానేసి వాటిమీద ఆధారపడుతున్నారు. వాళ్ళే కాదు- మెడికల్ కాలేజ్ స్టాఫ్, స్టూడెంట్స్ హనుమంతు ఇడ్లీలు, పెసరట్లు రుచి మరిగారు. కూలిజనం ఎప్పుడు పడితే అప్పుడు మెడికల్ కాలేజీలోకి వెళ్ళి 'చా' తాగలేరు కానీ కాలేజీ జనం ఎప్పుడు బడితే అప్పుడు బైటకొచ్చి హనుమంతు కొట్లో తినగలుగుతున్నారు.

ఆ కట్టడం చకచకా ఎలా పైకి లేస్తోందో అంతే చకచకా హనుమంతు టీకొట్టు ప్రాశస్త్యం పెరగసాగింది.

కట్టడం పూర్తి అయింది. కూలిజనం వెళ్ళిపోయారు,. ఫ్లాట్స్ కొనుక్కున్న వాళ్ళు, కొనుక్కున్నవాళ్ళ దగ్గిర అద్దెకు తీసుకునేవాళ్ళు ఒక్కొక్కరే దిగుతున్నారు.

కూలిజనం వెళ్ళినా ఫ్లాట్స్ జనం రావడం, ఆల్రెడీ మెడికల్ కాలేజీ స్టాఫ్, కుర్రాళ్ళు హనుమంతు ఇడ్లీ, పెసరట్ రుచి మరిగి ఉండడంతో అమ్మకాలు ఏమీ తగ్గలేదు. పెరిగాయి కూడా! పెరుగుట తరుగుట కొరకే కదా! అమ్మకాలు పెరగడం హనుమంతు తరుగుటకు దారితీసింది. సుబ్బయ్యలోని దుర్బుద్ధి ఒక్కసారి నిద్రలేచి ఆవలించి ఒళ్ళు విరుచుకుంది.

హనుమంతు కొట్లో వస్తున్న డబ్బంతా ముడిసరుకు, యితర పదార్థాలు కొనడానికి మినహాయించి మిగతాదంతా ఎప్పటికప్పుడు సుబ్బయ్యకు జమ కడుతున్నాడు. మొదట్లో సుబ్బయ్య హనుమంతుకిచ్చిన అసలు, వడ్డీ, ఆ వడ్డీకి వడ్డీ యివన్నీ ఎప్పుడో తీరిపోయాయి. అయినా ఇస్తూనే వున్నాడు. సుబ్బయ్య తీసుకుంటూనే వున్నాడు. పదిమందితో మెలగడం వల్ల, రకరకాల మనుషులు వచ్చి, టిఫిన్లు తింటూ, టీ తాగుతూ చెప్పుకునే కబుర్ల వల్ల హనుమంతు లోకజ్ఞానం పెరగసాగింది. ఆ పెరిగిన లోకజ్ఞానంతో సుబ్బయ్యను పశ్నలు అడగసాగాడు. అందులో కొన్ని ఖచ్చితంగా సుబ్బయ్యని ఇబ్బంది పెట్టే ప్రశ్నలే. అదే విషయం క్రితం వారం సుబ్బయ్య భార్య మంగతాయారు కూడా నొక్కి వక్కాణించింది- 'ఆ హనుమంతు లోగడలాగా లేడు. ప్రపంచజ్ఞానం పెరిగిపోతోంది.'

ఏ ప్రభుత్వమైనా నిరక్షరాస్యత రూపుమాపే పేరుతో చదవడం, రాయడం నేర్పాలనుకుంటుంది. కానీ విజ్ఞానం నేర్పాలని అనుకోదు. ప్రభుత్వం ప్రజలది కాబట్టి, ప్రజలంటే సుబ్బయ్యా, వాడి భార్యలాంటివారే కాబట్టి హనుమంతు విషయం వారికి నచ్చలేదు. ఫలితంగా సుబ్బయ్యకు కొడుకు వరస అయినవాణ్ణి ఒకణ్ణి, భార్యకు తమ్ముడు వరస అయినవాణ్ణి ఒకణ్ణి

రప్పించి కేంటీన్ నడిపే పని అప్పగించారు. హనుమంతుకు ఇంట్లో మొక్కలకు నీళ్ళు పోయడం , బూజులు దులపడం, రాత్రి సుబ్బయ్యకు నిద్ర పట్టేవరకూకాళ్ళు పట్టడం- యిలాంటి పనులు అప్పగించారు.

హనుమంతుకు కొంత అర్థమైంది. కొంత అర్థం కాలేదు. తను చేసిన తప్పేమిటి? ఓ రోజు దొర ఇంట్లో లేనప్పుడు దొరసాని కాళ్ళు పట్టమంటే పడుతూ అడిగాడు. ఆమె విస్మయంగా చూసి- "అదేం లేదురా. కేంటీన్ కొచ్చే జనాలు పెరిగారు కదా! పాపం నీవొక్కడి వల్లా కష్టం కదా- అందుకు". అందుకు కాదని మరెందుకో అని హనుమంతుకు అనిపించింది.

వారం రోజులు కేంటీన్ సజావుగానే సాగింది. కానీ ఆ పైన జనం పలచబడ్డారు. పెసరట్టు హనుమంతు చేస్తున్నట్లు రాకపోవడమే ప్రధాన కారణం అని సుబ్బయ్య పసిగట్టాడు.

వెంటచే హనుమంతుకి క్యాంటీన్ డ్యూటీ పడింది. హనుమంతు చేతి రుచి మరిగిన జనం మళ్ళీ రావడం మొదలుపెట్టారు. సంబరపడ్డాడు హనుమంతు. ఆ సంబరంలో టమోటారైస్, లెమన్‌రైస్ చేయడం మొదలెట్టాడు. వాటితో పాటు స్పెషల్ వడ కూడా! అవీ బావున్నాయని పేరొచ్చింది.అంతా బాగానే వుంది కానీ ఇదివరకు టీకొట్లో మొత్తం అంతా తనే! టిఫిన్లు చేయడం, సర్వ్ చేయడం, కేష్ డీలింగ్ అన్నీ తానే! ఇప్పుడు అన్ని విధాలా పెరిగిన కేంటీన్‌లో కేవలం టిఫిన్లు చేయడం, అప్పుడప్పుడు తానూ వున్నానన్నట్లు కనిపించడం తప్ప తనకు లోగడవున్న గుర్తింపు లేదు. పైగా ఇంటి డ్యూటీ, ముఖ్యంగా సుబ్బయ్యకు కాళ్ళు పట్టే డ్యూటీ తప్పడం లేదు. దాని వల్ల బాగా నలిగిపోతున్నాడు హనుమంతు. కాళ్ళు పట్టించుకునే నెపంతో హనుమంతు ద్వారా కేంటీన్ విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాడు సుబ్బయ్య. తన కొడుకు వరసవాడికి, భార్య తమ్ముడి వరస వాడికి హనుమంతు సంగతి నచ్చడం లేదని సుబ్బయ్యకు అర్థమైంది. తినడానికి వచ్చినవారంతా పదార్థాలు బావున్నాయని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో హనుమంతును మెచ్చుకోవడం వారికి కంటకంగా ఉందనే విషయం సుబ్బయ్యకు అర్థమైంది.

* * *

నగరం నడిబొడ్లో వున్న రెండు హొటల్స్ నుంచి చెరొకర్ని తెచ్చి కేంటీన్‌లో పెట్టాడు సుబ్బయ్య. ఇద్దర్నీ ఒకే హొటల్ నుంచి తేవచ్చు. అలా తేలేదు. తెస్తే ఇద్దరూకుమ్మక్కయ్యే అవకాశం వుందని సుబ్బయ్యకు తెలుసు. ఇద్దరిలో ఒకడు అయ్యరు. సాంబారు బాగా పెడతాడు. ఇదివరకు కేంటీన్‌లో సాంబారు లేదు. ఒక కొత్త అయిటమ్ చేస్తేనే కదా- జనం హనుమంతు వంటకాలు మర్చిపోయేది! రెండోవాడు మాణిక్యం. దోసె మాస్టర్. ఈ రెండు కొత్తవాటితోనే జనం సంతోషించారు. హనుమంతు ప్రాపకం నెమ్మదిగా తగ్గింది. అయినా వాడిచేత ఇంట్లో కాళ్ళు పట్టించుకోవడంతో బాటు కేంటీన్‌లో పిండి రుబ్బించడం, బల్లలు తుడిపించడం, గిన్నెలు, గ్లాసులు తోమించడం చేయసాగాడు సుబ్బయ్య. క్రమేపీ.. ఒక్కో మెట్టూ తానుదిగజారిపోతున్నానే భావం మనసులో మెదిలి స్థిరపడసాగింది హనుమంతుకు.

ఒకనాడు రెక్కలు విప్పుకుంటున్న పక్షిలా అనిపించిన జీవితం ఇప్పుడు తెగిపోయినట్లు అనిపించసాగింది. తన ఉనికికే ప్రమాదం ఏర్పడిన అక్కడ యింక వుండకూడదు, వెళ్ళిపోవాలి. అదే చెప్పాడు ఓ రోజు కాళ్ళు పడుతూన్న సుబ్బయ్యతో. అసలే మందు




మీదున్నాడేమో హనుమంతును ఒక్క తన్ను తన్నాడు సుబ్బయ్య. కాళ్ళ దగ్గిరున్న వాడ్ని తన్నడం సులువు కదా!

"ఎల్లిపోతావా- నా బాకీ ముప్పయివేలు తీరిసేసి ఎల్లిపో!"

"ముప్పయివేలేటి!?"

"ఏటా!? ముప్పయివేలు తీసుకున్నానని యిదుగో నువ్వేసిన ఏలుముద్దర" అంటూ బీరువాలోంచి ప్రోనోటు తీసి చూపించిడు సుబ్బయ్య.

"ఆ డబ్బు కేంటీన్ కోసం యిచ్చింది. ఆ డబ్బుకన్నా నేను చాలా ఎక్కువ డబ్బు జమ చేసాను. ఇది అన్యాయం" అన్నాడు హనుమంతు.

"అన్నాయమే. పెపంచంలో వున్నదదే. తిరగ బడతావా, ఏదీ తిరగబడు సూద్దాం" అంటూ మరో తన్ను తన్నాడు సుబ్బయ్య.

తన్నినవాడు నిద్రపోతాడు కాబట్టి సుబ్బయ్య నిద్రపోయాడు. తిన్నవాడు నిద్రపోలేదు కాబట్టి హనుమంతు నిద్రపోలేదు. పొద్దున్నే సుబ్బయ్య ఏమీ ఎరగనట్లు పనులు చెప్పాడు. ఎరిగీ ఎరగనట్లు హనుమంతు చేశాడు.

వారం రోజులు గడిచిపోయాయి. ఆ రోజు హనుమంతు, దొరసాని తప్ప యింట్లో ఎవరూ లేరు. సాయంత్రం హనుమంతు కేంటీన్‌కు వెడతానంటే స్నానం చేసి వచ్చేవరకూ ఆగమని స్నానానికెళ్ళిందామె. పొరపాటున బీరువా తాళం చేతులు బీరువాకే వేలాడుతున్నాయి. ఇంక ఆలస్యం చేయలేదు హనుమంతు. బీరువాలో తన ప్రోనోటు కోసం వెదికాడు. కనిపించింది. అది తీసాడు. దానికింద అలాటిదే మరొకటి. అదీ తీశాడు. దానికింద అలాటిదే ఇంకొకటి.. మరొకటి. అవీ తీశాడు. అందులో తనదేదో చదువురా, చదువు లేని హనుమంతుకు తెలియలేదు. అయితేనేం తన లాంటి వాళ్ళవే. అవి ఎందరివో అనే విషయం తెలిసింది, మొత్తం అన్నీ తీసేశాడు.

నిక్కరుజేబుల్లోనూ, కడుపుకూ నిక్కరకూ మధ్యలోనూ పేర్చి పైనున్న చొక్కా ఆసరాతో మామూలుగానే కనిపిస్తూ బీరువా మూసి, వేరే గదిలోకి వెళ్ళి చీపురు తీసుకుని వూడ్చే కార్యక్రమం చేపట్టాడు. దొరసాని స్నానం చేసి వచ్చాక, ఆమెతో చెప్పి కేంటీన్ వైపు నడిచాడు.

కేంటీన్‌లో పొయ్యి మండుతోంది-

కొన్నాళ్ళ క్రితం ఢిల్లీలో ఆయనెవరో పెద్దమనిషి భార్యను ముక్కలు ముక్కలుగా నరికించి కేంటీన్ పొయ్యిలో వేయించిన సంగతి ఎవరో చెప్పుకోగా విన్నాడు హనుమంతు. ఆమె ఎలాంటిదైనా అది నిజంగా అమానుషమే. తను- అలా చేయడం లేదు. ఒక్కో ప్రోనోటు ముక్కలు చేసి పొయ్యిలో పారేసి కాలుస్తున్నాడు. ఇలా కాల్చడం ఎన్నో జీవితాలను రక్షించడం, స్వేచ్ఛనివ్వడం- మొత్తం పని పూర్తి చేసి బైటకొచ్చి వొళ్ళు విరుచుకున్నాడు హనుమంతు.

నడక ప్రారంభించాడు హనుమంతు. ఆకాశంలో సూర్యుడు అస్తమిస్తున్నాడు. హనుమంతుకు అది అస్తమయంలా లేదు. సరికొత్త ఉదయంలా వుంది.